క్లుప్తంగా

లగేజీ బ్యాగ్ అప్పగింత



వేములవాడఅర్బన్: వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి సిరిసిల్లకు వస్తున్న తరుణంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన అజార్ఖాన్ అనే వ్యక్తి బ్యాగును బస్సులో మరిచిపోయాడు. ఆ బ్యాగును కండక్టర్ సాయి భద్రపరిచి ప్రయాణికుడి అజార్ఖాన్‌కు అప్పగించాడు.

ఆర్ఎంపీలకు గుర్తింపునివ్వాలి



మాట్లాడుతున్న ఆర్ఎంపీలు

కోనరావుపేట: గ్రామాల్లో పని చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణిచ్చి తగిన గుర్తింపు నివ్వాలని ఆర్ఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐదరి శ్రీనివాస్ కోరారు. ఆదివారం కోనరావుపేటలో సమావేశమై ఆర్ఎంపీల సమస్యలపై మాట్లాడారు. ఇదివరకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తూ సర్టిఫికెట్లు అందించాలన్నారు. అర్హత లేదంటూ తమపై దాడులు నిర్వహించడం తగదని అన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపెల్లి ప్రభాకర్, సీనియర్ ఆర్ఎంపీలు బాలరాజు, దేవానందం, సత్యం, రాములు, భాస్కర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, శంకర్, మల్లేశం తదితరులున్నారు.

మండల అధ్యక్షుడికి సన్మానం



శేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: భారతీయ జనతా పార్టీ వేములవాడ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్‌ను గుర్రవానిపల్లి గ్రామ కార్యకర్తలు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. సమన్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

రేషన్ కార్డుల కోసం ఆందోళన వద్దు

ఎల్లారెడ్డిపేట: రేషన్ కార్డుల కోసం ప్రజలు ఆందోళన చెందొద్దని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

కోనరావుపేట: కనగర్తి గ్రామ మాజీ ఉప సర్పంచ్ సింగం నారాయణ(68) మృతిచెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించి వైద్యసేవలందించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య రాజవ్వ, ఇద్దరు కుమారులు నాగరాజు, పర్శరాములు, కూతురున్నారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

కోనరావుపేట: కనగర్తిలో కొన్ని నెలలుగా కోతుల బెడద ఎక్కువవుతోంది. గ్రామంలోని తన ఇంటి వద్ద ఓ మహిళ పనులు చేసుకుంటుండగా కోతి దాడి చేసింది. ఈ దాడిలో కాలికి గాయమైంది. వెంటనే కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకుంది.

క్రీడలతో మానసికోల్లాసం



ఎల్లారెడ్డిపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో స్పోర్ట్స్ క్లబ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నీలోని విజేత జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎస్సై రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేల గొంతులు.. లక్ష డప్పులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఈనెల 24న నిర్వహించే వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమం సన్నాహక సమావేశాన్ని ఆదివారం మండలంలోని రాచర్లగొల్లపల్లిలో నిర్వహించారు. నేతలు దరువు రమేశ్, బరుకుటి విజయ్, అందె సామ్యూల్, ఎమ్మెర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
ఇల్లంతకుంట: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఎస్సీ వర్గీకరణ అమలుకు వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం వైశ్య భవన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు ఆవునేరి ప్రభాకర్ మాట్లాడారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి వ్యాఖ్యలకు నిరసనగా ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సావనపల్లి రాకేశ్, రాజు, పసుల బాలరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.







ఆదివారం ఉదయం 6.55 గంటలకు మానేరు వాగు తీరంలో మంచు తెరల్లోనూ పిల్లల వ్యాయామం, సిరిసిల్లలో మంచులో జాగింగ్, సిరిసిల్ల మధ్య మానేరు బ్యాక్ వాటర్ మంచులో సూర్య కిరణాలు

కార్మిక క్షేత్రంపై మంచు దుప్పటి

సిరిసిల్ల: సిరిసిల్ల కార్మిక క్షేత్రాన్ని ఆదివారం ఉదయం పొగ మంచు కప్పేసింది. తెల్లవారుజామున 6 గంటల నుంచి 8 గంటల వరకు జిల్లా కేంద్రాన్ని మంచు తెరలు వీడలేదు. ఉదయం పూట వ్యాయామం చేసేవాళ్లు, దినచర్యలను ప్రారంభించే వాళ్లు పొగ మంచులోనే ముందుకు సాగారు. సిరిసిల్లను ఆదివారం కమ్మేసిన పొగ మంచు దుప్పటి ధాటికి సూర్య కిరణాలు సైతం నేలను తాకలేదు. మధ్య మానేరు బ్యాక్ వాటర్‌లో సూర్య కిరణాల ప్రతిబింబం మసక బారింది.



బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో పొగ మంచులో గొర్రెల మంద



సిరిసిల్ల విద్యానగర్‌లో కప్పేసిన పొగ మంచు

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	01	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	01	336

\- వేములవాడ

దరఖాస్తు చేసుకోండి

తంగళ్లపల్లి: పద్మనగర్ కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో స్వీపర్ కమ్ స్కావెంజర్, అసిస్టెంట్ కుక్ పోస్టు ఖాళీలున్నాయని, దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి భూక్య రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



బోయినపల్లి: పోలీసుల బైక్ ర్యాలీ



వేములవాడరూరల్: ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, వాహనదారులు



అవగాహన కల్పిస్తున్న రుద్రంగి ఎస్సై అశోక్



కోనరావుపేటలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

రహదారి భద్రత అందరి బాధ్యత

వేములవాడరూరల్: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. వట్టెంల గ్రామం నుంచి ఫాజుల్‌నగర్ వరకు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వాహనదారుడు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ మారుతి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్‌గౌడ్, గ్రామస్తులు, వాహనదారులు, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
కోనరావుపేట: ప్రతి ద్విచక్ర వాహనదారు తన స్వీయ రక్షణతోపాటు తన కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కోనరావుపేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వేములవాడ రూరల్ సీఐ ఎం.శ్రీనివాస్, ఎస్సైలు ప్రశాంత్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
బోయినపల్లి: ప్రతీ వాహనదారుడు తలకు హెల్మెట్ ధరించి బైక్ నడపాలని ఎస్సై దూలం పృథ్వీధర్‌గౌడ్ సూచించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం పలువురు వాహనదారులతో కలిసి హెల్మెట్లతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనకయ్య తదితరులున్నారు.
రుద్రంగి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు. మండల కేంద్రంలో యువకులు, నాయకులతో కలిసి బైక్ ర్యాలీ తీశారు. ఏఎస్ఐ కన్నీరాం, పోలీస్ సిబ్బంది ప్రభాకర్, సంతోష్, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, తర్రె లింగం తదితరులు పాల్గొన్నారు.
వేములవాడ: నిబంధనలు పాటించకుంటే చట్ట రీత్యా చర్యలు తప్పవని టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. పట్టణంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు.
ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
చందుర్తి: చందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై అశోక్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించక ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. కానిస్టేబుళ్లు, యువకులు పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: మండల కేంద్రంలో ఎస్సై బి.రామ్మోహన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.
గంభీరావుపేట: గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సైలు శ్రీకాంత్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజు విధులు

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ అధికారులు సెలవు రోజు కూడా డ్యూటీ చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీకి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆదివారం సెలవు దినమైనా ఎంపీడీవో కె.లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వే చేశారు. సర్వేను డీఆర్డీవో ఇన్‌చార్జి డీపీవో బి.శేషాద్రి పరిశీలించారు. ఎంపీవో మీర్జా అహ్మద్ బేగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో సర్వే పరిశీలిస్తున్న డీఆర్డీవో

కుల వృత్తులకు ప్రాధాన్యం

వేములవాడ: కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర మోచీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆదివారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ పార్టీలో చేరారని విప్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం శాబాష్‌పల్లికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్, ప్రతాప రామకృష్ణ

కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు

సిరిసిల్లటౌన్: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రతిపాదన చేస్తానని అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల పరశురాం కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగారం కొమరవ్వ, యూత్ విభాగం అధ్యక్షుడు రెడ్డవేని పరశురాం, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు కోడం రవి, జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేశ్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దొరిశెట్టి అరుణ్ తేజాచారి, జిల్లా సభ్యుడు మారవేణి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎల్లారెడ్డిపేట మండల నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు పెద్దోళ్ల బాలయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా బోయిన బాబు, కార్యదర్శిగా కోరే దేవదానం, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నేతట్ల అనిల్ ఎన్నికయ్యారు. నియామక పత్రాలు అందజేశారు.
ఎల్లారెడ్డిపేట: పార్లమెంట్ చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ కోసం ప్రతిపాదన చేస్తానని అధికారికంగా ప్రకటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మేకల పర్శరాం, మండల అధ్యక్షుడు బాలయ్య, నాయకులు వెంకటేశ్, బోయిన బాబు, దేవదానం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లటౌన్: నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

భూముల అన్యాక్రాంతంలో అసలు ముద్దాయి కేటీఆర్

తంగళ్లపల్లి: జిల్లాలో ప్రభుత్వ భూములు బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా పొందడంలో అసలు ముద్దాయి అప్పటి మంత్రి కేటీఆర్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. ఆదివారం దేశాయిపల్లెలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అసలైన రైతులకు పట్టాలు లేవని, కేటీఆర్ అనుచరులకు మాత్రం పాస్ పుస్తకాలు ఎలా వచ్చాయన్నారు. దేశాయిపల్లె గ్రామ శివారులోని సర్వే నంబర్ 338లో 150 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందన్నారు. నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్న నిధులను రద్దు చేశారు

కోనరావుపేట: గ్రామాల అభివృద్ధికి మంజూరయిన నిధులను రద్దు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అన్నారు. కోనరావుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని మూల వాగుపై వంతెనల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.52 కోట్లను మంజూరు చేయగా.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేయకుండా ఉన్న నిధులను రద్దు చేసి ఇతర పనులకు మళ్లించారన్నారు. కొండాపూర్ పెంటి వాగుపై వంతెన కోసం రూ.5కోట్లు మంజూరు కాగా.. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను మధ్యలోనే ఆపేశారని అన్నారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కెంద గంగాధర్, నాయకులు దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, మాందాల శ్రీనివాస్, శివతేజ, శంకర్, దండు రవి, కొండాపూర్ గ్రామస్తులున్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

గంభీరావుపేట: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లారెడ్డిపేటలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు.

అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్న నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ నాయకులు పలువురు ఆదివారం త్రివేంద్రంలోని శ్రీఅనంత పద్మనాభస్వామివారి యాత్రకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. గజభీంకార్ రాజన్న, మచ్చ ఆంజనేయులు, రాపెల్లి ఆనందం, అంకారపు రవీందర్ తదితరులున్నారు.

వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయం

వేములవాడ: వేములవాడలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం అన్నారు. ఇందుకు ముందుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి నిర్వాహకులను ఆయన అభినందించారు. పట్టణంలోని ఆర్యవైశ్య నిత్యాన్న దాన సత్రంలో ఉచిత రక్త నాళాల వ్యాధితో బాధపడుతున్న వారికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కుమార్, డాక్టర్ శశి, వాసవి ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, ఆర్యవైశ్య ప్రముఖులు చీకోటి శ్రీహరి, నగుబోతు రవీందర్, సిద్ధంశెట్టి వేణు, చేపూరి గణేశ్, కటకం జనార్దన్, చకినాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత

గంభీరావుపేట: రాజేశ్వర్‌రావునగర్ గ్రామంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల బాబు సొంత ఖర్చులతో యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్లు అందించారు. కిట్లను యూత్ ప్రతినిధి సతీశ్‌కు అప్పగించారు.
రాజేశ్వర్‌రావునగర్ గ్రామంలో స్వాతంత్ర్య యోధుడైన ఒడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. పిట్ల బాబు, నర్సయ్య, లక్ష్మణ్, వెంకటి, వెంకటనర్సు, శ్రీనివాస్, లింగం, నర్సింలు, రాములు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



రుద్రవరం ప్రభుత్వ పాఠశాల 2001-02 పూర్వ విద్యార్థులు

వేములవాడఅర్బన్: బాల్యం అంటే గుర్తుకు వచ్చేది తీపి జ్ఞాపకలు.. చిన్ననాటి చిలిపి చేష్టలు.. పాఠశాలలో చదువుకున్న రోజులు.. పగటి పూట సద్ది గిన్నెలు.. ఒంటి పూట బడి.. ఇలాంటి జ్ఞాపకాలు 22 సంవత్సరాల తర్వాత ఒక వేదిక మీద పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పంచుకున్నారు.
వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 పదోతరగతి విద్యార్థులు అగ్రహారం శ్రీకన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చిన్ననాటి బాల్య స్నేహితులను కలవడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చి కలుసుకొని ముచ్చటించారు. పూర్వ ఉపాధ్యాయులు భాస్కర్, బొక్కయ్య, నారాయణరెడ్డి, శ్రీదర్, ఉమాదేవి, దేవయ్య, పూర్వ విద్యార్థులు మంగ, కళ్యాణి, వాణి, సుజాత, అమరగొండ కిషన్, మెండె పర్శరాములు, బొల్లు తిరుపతి, శ్రీధర్, అశోక్, ఆంజనేయులు, నరేశ్, సమ్మయ్య, మస్తాన్, రాజశ్రీను, పద్మ, కవిత, రజిత, సుమలత, శ్రీనివాస్, శ్రీకాంత్, మహేశ్ తదితరులున్నారు.

జెడ్పీహెచ్ఎస్ అంటేనే రుద్రవరం

రుద్రవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆనాడు చుట్టుపక్కల గ్రామాలు సంకెపల్లి, గోల్లపల్లె, ఆరెపల్లి గ్రామాల విద్యార్థులు కాలినడకన, సైకిల్‌పై వెళ్లి చదువుకునేవారు. అప్పుడు రుద్రవరం పాఠశాల అంటే పెట్టింది పేరుగా ఉండేది. ఒక్కో తరగతి గదిలో 40 మందికి మించి ఉండేవారు. ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానంలో ఉన్నారు.

చాలా సంతోషంగా ఉంది



పాఠశాల అనంతరం 22 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలవడం చాలా సంతోషంగా ఉంది. ఇలా కలవడానికి వారం రోజుల ముందు నుంచి ప్లాన్ చేసి దూర ప్రాంతాల నుంచి వచ్చి అందరం కలుసుకోవడం ఆనందంగా ఉంది.

\- రామిడి మంగ, విద్యార్థిని

గురువులను సన్మానించడం ఆనందం



చదువుకున్నప్పటి నుంచి విద్యార్థులు గురువులను కలువడం ఇదే మొదటిసారి. ఇలా వేదికపై కలుసుకొని అందరి పలకరింపు ఎంతో ఆనందంగా ఉంది. ఆనాటి జ్ఞాపకాలు మరువలేనివి. గురువులకు సన్మానం చేయడం సంతోషంగా ఉంది.

\- చిట్టిరెడ్డి కళ్యాణి, విద్యార్థిని

ఎప్పటి నుంచో అనుకున్నాం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. 22 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఇలా కలుసుకోవడం చాలా సంతోషం. మళ్లీ సిల్వర్ జూబ్లీకి కలుసుకుందామని అనుకున్నాం.

\- కవిత, విద్యార్థిని



గంభీరావుపేట: ముస్తాబాద్ మండలం గూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.



బోయినపల్లి: నర్సింగాపూర్ హైస్కూల్‌లో 2002–2003 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం హైస్కూల్ పరిసరాల్లో సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గతంలో పాఠాలు చెప్పిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు.

సంక్రాంతి బహుమతులు

సిరిసిల్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుమల ఎలక్ట్రానిక్స్ ప్రతి ఏటా నిర్వహించే లక్కీ డ్రాను ఆదివారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించారు. బంపర్ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి మచ్చేందర్ గెలుపొందాడు. ప్రథమ బహుమతి సాంసంగ్ డబుల్ డోర్ ఫ్రిడ్జ్ చీర్లవంచకు చెందిన అనిల్‌కుమార్ సొంతం చేసుకున్నాడు. ద్వితీయ బహుమతిగా సాంసంగ్ సింగిల్ డోర్ ఫ్రిడ్జ్, మూడో బహుమతిగా మైక్రో ఓవెన్, నాలుగో బహుమతిగా పది మందికి మిక్సర్ గ్రైండర్, ఐదో బహుమతిగా పది మందికి బెడ్ షీట్స్, ఆరో బహుమతిగా పది మందికి నాన్ స్టిక్స్ డ్రా తీసి కస్టమర్లకు అందించారు. తిరుమల ఎలక్ట్రానిక్స్ 38వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా బహుమతులివ్వడం సంతోషంగా ఉందని సంస్థ అధినేతలు పోకల సుధాకర్, పోకల సుమన్ తెలిపారు. రంగినేని ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు, సినీ నటుడు మానవ కోటేశ్వరరావు, బజాజ్ ఫైనాన్స్ ఆర్ఎస్ఎం దుర్గాప్రసాద్, సాంసంగ్ డిస్ట్రిబ్యూటర్ కోటగిరి శ్రీనివాస్, సిరిసిల్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటకం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతి గెలుచుకున్న మచ్చేందర్